క్లుప్తంగా

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన



కళాజాత ప్రదర్శన

నగరి: పట్టణంలోని సంతలోని మార్కెట్ యార్డ్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, స్టెప్స్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జంగం నాగరాజు కళాజాత బృందం వీధి నాటక ప్రదర్శనతో అవగాహన కల్పించింది. ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎయిడ్స్, క్షయ వ్యాధి మధ్య సంబంధం, సుఖ వ్యాధులకు చికిత్స, కండోమ్ వాడకంపై అవగాహన కల్పించారు. స్టెప్స్ నగరి ప్రాజెక్ట్ మేనేజర్ ఆర్.ఆర్ముగం, సిబ్బంది కలైవాణి, ఇందుమతి, కీర్తి, సాము, అశ్విని, గుణసుందరి, సీలారాణి పాల్గొన్నారు.

ఘనంగా పౌర్ణమి పూజలు



పూజల్లో పాల్గొన్న మహిళలు

పుత్తూరు: పట్టణంలోని శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని గీతా మందిరంలో శ్రీకృష్ణ పరమాత్మకు శుక్రవారం పౌర్ణమి పూజలను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం గీతా పారాయణం, భజనలు నిర్వహించారు. మహిళలు శ్రీకృష్ణ భగవానుడికి పౌర్ణమి హారతులిచ్చారు. అనంతరం ఉత్సవ మూర్తిని ఊయలలో శయనింపజేసి 'జోఅచ్యుతానంద జోజోముకుందా.. లాలి పరమానంద రామ గోవిందా జో...జో' గీతాన్ని ఆలపిస్తూ ఏకాంత సేవ నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు ఈ క్రాప్ నమోదుకు తుది గడువు

విజయపురం(నగరి): ఈక్రాప్ నమోదుకు శనివారం తుది గడువని విజయపురం ఏవో రజినికుమారి తెలిపారు. 2023 రబీకి సంబంధించి పంట సాగు వివరాలన్నీ ఈ క్రాప్ బుకింగ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలో 886 మంది రైతులు 249 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్న పంటల వివరాలను ఈక్రాప్ నమోదు చేసినట్లు తెలిపారు. మిగిలిన వారు శనివారం సాయంత్రం లోపు ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని కోరారు. అలాగే ఈకేవైసీ చేసుకోవాలని సూచించారు. ఈ క్రాప్ బుకింగ్ ఆధారంగానే రైతులకు సున్నావడ్డీ, క్రాప్‌లోన్, విద్యుత్ సరీ్వస్, ఇతర ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందుతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలన్నారు.

గుంటిపల్లెలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'



మాట్లాడుతున్న సర్పంచ్ మంగమ్మ

పెనుమూరు(కార్వేటినగరం): ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్నదే జగనన్న ఆరోగ్య సురక్ష ఉద్దేశమని జెడ్పీటీసీ సభ్యుడు దొరస్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని గుంటిపల్లె సచివాలయం ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష–2 నిర్వహించారు. దొరస్వామి శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. డాక్టర్ హర్షవర్ధన్ తమ బృందంతో కలిసి 190 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసి స్టాల్‌ను ప్రజాప్రతినిధులు పరిశీలించారు. సర్పంచులు తులసమ్మ, మునిరత్నంరెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, డాక్టర్లు రాజశేఖర్, మీనా సయ్యద్, వెంకటేశ్వర్ నాయుడు,ఈఓపీఆర్డీ మహేశ్వర్‌రెడ్డి, డీడీఓ నిర్మల పాల్గొన్నారు.

సీడీ కండ్రిగలో..

కార్వేటినగరం: మండలంలో సీడీ కండ్రిగ సచివాలయ ఆవరణలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ మంగమ్మ దీనిని ప్రారంభించి మాట్లాడారు. వైద్యబృందం రోగులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేసింది. అంగన్‌వాడీ సిబ్బంది పౌష్టికాహార స్టాల్ ఏర్పాటు చేశారు. ఏఎంసీ డైరెక్టర్ ఆకుల గోపి, టీకేఎం పేట గోవిందమ్మ, నాయకులు కుప్పారెడ్డి, లక్ష్మీపతిరెడ్డి, వైస్ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు అర్ధగిరి క్షేత్రంలో పౌర్ణమి వేడుకలు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానంలో శనివారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి తెలిపారు. ఉదయం అభిషేకం, ప్రత్యేక పూజలు, సుదర్శన హోమం నిర్వహించనున్నట్లు చెప్పారు.



పార్కులో సందర్శకుల సందడి



పార్కులో చిన్నారుల కేరింతలు



మెడికేటెడ్ ట్రాక్‌పై నడుస్తున్న మంత్రి ఆర్కే రోజా

ఆనందమానందమాయెనే!

- నగరి ప్రజల చిరకాల స్వప్నం సాకారం
- ఆహ్లాదాన్ని పంచుతున్న తుడా పార్కు
- నిత్యం సందర్శకుల కోలాహలం

నగరి: గ్రామీణ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు పచ్చని బయళ్లు, నీడనిచ్చే చెట్ల కింద రాతిబండలు, పూలచెట్లు కనువిందు చేస్తుంటాయి. గ్రామాల్లో ఉండే రైతులు, వృద్ధులు ఆ ప్రాంతాల్లో కూర్చుని పిచ్చాపాటి మాట్లాడుకుంటారు. చెట్ల తీగలతో కట్టే ఊయలలు చిన్నారులకు ఆనందాన్ని పంచుతాయి. అయితే మున్సిపాలిటీ స్థాయికి ఎదిగిన పట్టణాల్లో ఇవి ఎక్కడా కనిపించవు. పచ్చని చెట్లు, స్వచ్ఛమైన గాలి ఉన్న ప్రాంతాల్లో కాసేపు కబుర్లు చెప్పుకోవాలంటే వారికి ఉండే ఏకైక ప్రాంతం పార్కులు మాత్రమే. 2005లో నగరి పట్టణం మున్సిపాలిటీగా రూపాంతరం చెందడంతో నగరిలో పార్కును ఏర్పాటు చేస్తారనుకున్న స్థానిక ప్రజలకు ఆ కోరిక నెరవేరలేదు. మంత్రి ఆర్కే రోజా పట్టు వదలకుండా చేసిన ప్రయత్నంతో నగరి ప్రజల చిరకాల స్వప్నం సాకారమైంది. కుశస్థలీ నది ఒడ్డున రూ.80 లక్షల నిధులతో డాక్టర్ వైఎస్సార్ తుడా పార్కు స్థానిక ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. తీరిక వేళల్లో సెల్‌ఫోన్లకు బంధీలైన విద్యార్థులను పార్కు విముక్తుల్ని చేసింది. బయట ప్రపంచంలో చల్లనిగాలి పీలుస్తూ ఆనందంతోపాటు ఆరోగ్యాన్ని పిల్లలు నేడు పొందుతున్నారు.

అలరిస్తున్న పార్కు

పార్కులోని పచ్చదనం అందరినీ స్వాగతిస్తోంది. వాకర్స్‌కు పార్కులో ఏర్పాటు చేసిన మెడికేటెడ్ ట్రాక్ ఆరోగ్యాన్ని పంచుతోంది. చిన్నారులు ఆడుకోవడానికి సిద్ధంగా ఉంచిన స్వింగ్ సీసా, ఊయలలు, మెర్రీ గో రౌండ్, బోట్ స్వింగ్ సీసా, స్లైడ్స్, క్లైంబర్ చిన్నారులను ఆకర్షిస్తున్నాయి. పార్కుకు వెళ్లి ఆడుకోవడానికి చిన్నారులు ఉత్సాహం చూపుతున్నారు. పిల్లా పాపలతో పార్కుకు వెళ్లి ఆనందంగా గడిపేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. టేబుల్స్‌పై కూర్చుని కాసేపు సేదతీరుతున్నారు. పార్కు అందాల మధ్య నిలబడి ఫొటోలు తీసుకుంటున్నారు. సెలవు రోజుల్లో సందడే సందడిగా మారుతోంది.

ఎన్నోరోజుల కల నెరవేరింది



పేరుకే మున్సిపాలిటీ. పిల్లాపాపలతో అలావెళ్లి ఆనందంగా గడపడానికి ఒక పార్కుకూడా లేదు అంటూ సెలవు రోజుల్లో ఇళ్లకు వచ్చే బంధువులు కూడా అడిగే పరిస్థితి ఉండేది. నేడు ఆ పరిస్థితి పోయింది. కుటుంబంతో పాటు కొంతసేపు ఆనందంగా గడిపేందుకు పార్కు అందుబాటులోకి వచ్చింది. పార్కు ఏర్పాటుకు కృషిచేసిన మంత్రికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నా.

– ఢిల్లీబాబు, కీళపట్టు, నగరి

ఒత్తిడికి దూరంగా..



వృత్తి, ఉద్యోగాల రీత్యా ఎదురయ్యే ఒత్తిడి నుంచి ఉపశమనంగా గడిపేందుకు ఒక మంచి ప్రాంతం దొరికింది. తీరిక వేళల్లో కాసేపు ఇక్కడ గడిపితే మనసుకు ఎంతో ఆనందం వస్తోంది. ఉదయం పూట వాకింగ్‌కు ఉపయోగపడుతోంది. మెడికేటెడ్ ట్రాక్‌పై నడిచేవారికి షుగర్, బీపీ లాంటివి నియంత్రణలోకి వచ్చేందుకు ఎక్కువగా ఆస్కారం ఉంది.

–నరేష్, బీసీకాలనీ, నగరి

ఆడుకునేందుకు బాగుంది



పార్కులో పిల్లలు ఎంచక్కా ఆడుకునేందుకు కావలసిన స్వింగ్ సీసా, ఊయలలు, మెర్రీ గో రౌండ్, బోట్ స్వింగ్ సీసా, స్లైడ్స్ లాంటి పరికరాలు చాలా ఉన్నాయి. వాటిల్లో సాయంత్రం పూట పిల్లలు సరదాగా ఆడుకుంటున్నారు. వాటితో ఎంత ఆడినా పిల్లలకు సరదా తీరదు. మిత్రులతో కలిసి ఈ పచ్చని తోటలో ఆడుకుంటుంటే వచ్చే ఆనందం మాటల్లో చెప్పలేనిది.

–ఎంకె బావేష్, విద్యార్థి, నగరి

సెలవు దొరికితే వచ్చి ఆడుకుంటా



పార్కులో ఆడుకునేందుకు కావలసిన అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. అందుకే సెలవు దొరికినపుడల్లా వచ్చి ఇక్కడ ఆడుకుంటా. ఇదివరలో ఇలా ఎక్కడికైనా వెళ్లి ఆడుకుందాం అంటే పార్కు ఉండేది కాదు. దీంతో ఇంటికే పరిమితమై ఉండాల్సి వచ్చేది. ఇప్పుడు ఇలా వచ్చి ఆడుకోవడం ఎంతో ఆనందాన్ని ఇస్తోంది. పార్కులో రోజంతా సరదాగా గడపవచ్చు.

–సి.లక్ష్మి, నగరి









రా రమ్మంటున్న పార్కు అందాలు

పామాయిల్ సాగుపై రైతులకు అవగాహన



పామాయిల్ సాగుపై రైతులతో మాట్లాడుతున్న ఏపీఎం మురళి

గంగాధరనెల్లూరు: మండలంలోని పాపిరెడ్డిపల్లె రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం ఆయిల్ ఏజీఎం మురళి రైతులకు పామాయిల్ పంటపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ, ఆయిల్ పామ్ ఒక హెక్టారుకు (2.50) 143 మొక్కలు లేదా ఎకరానికి 57 మొక్కలు త్రికోణ పద్ధతిలో నాటుకోవాలన్నారు. నాటిన 4 ఏళ్ల వరకు అంతర పంట సాగు, ఎరువులకు ప్రభుత్వం రాయితీ ఇస్తుందని, దళారీ వ్యవస్థ లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే పారదర్శకంగా పామాయిల్ గింజలు కొనుగోలు చేస్తామన్నారు.. తక్కువ పెట్టుబడి, కూలీలతో ఎక్కువ ఆదాయం పొందవచ్చన్నారు. ఆసక్తి గల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ పార్థసారథి, రైతు భరోసా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం



వలంటీర్లను సన్మానిస్తున్న వైస్ ఎంపీపీ శేఖర్, సర్పంచులు

పాలసముద్రం: ప్రభుత్వానికి–ప్రజలకు మధ్య వారధిగా నిలిచిన వలంటీర్ల సేవలు అభినందనీయమని వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్ అన్నారు. శుక్రవారం శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయంలో వైస్ ఎంపీపీతోపాటు సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, గాలి మహేష్‌బాబు వలంటీర్లను సత్కరించి మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వలంటీర్లు సేవలు వెలకట్ట లేనివన్నారు. కరోనా సమయంలో వలంటీర్లు అందించిన సేవలు శ్లాఘనీయమన్నారు. దీనికి గుర్తింపుగా ప్రభుత్వం వారిని పురస్కారాలతో సముచిత రీతిలో సత్కరిస్తోందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజీవ్ కుమార్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి తిరుపతికి అదనపు సర్వీసు

పుత్తూరు: పుత్తూరు నుంచి తిరుపతికి వయా రేణిగుంట మీదుగా శనివారం నుంచి అదనపు బస్సు సర్వీసును ప్రారంభిస్తున్నట్లు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రశాంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు సర్వీసు ప్రారంభమవుతుందన్నారు. ఈసర్వీసు ఉదయం 10–30కు, మధ్యాహ్నం ఒంటి గంటకు సర్వీసు నడుస్తుందని పేర్కొన్నారు. తిరుపతి నుంచి పుత్తూరుకు వయా రేణిగుంట మీదుగా ఉదయం 9–15 గంటలకు, 11–45కు, మధ్యాహ్నం 2–15 గంటలకు సర్వీసు నడుస్తుందని వివరించారు. ప్రయాణికులు సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ సర్వీసుల్లో ప్రయాణించాలని కోరారు.

విద్యార్థులకు బ్యాంకు ఖాతాలు



విద్యార్థుల నుంచి అప్లికేషన్లు స్వీకరిస్తున్న సప్తగిరి బ్యాంకు మేనేజర్ జాకీర్ హుసేన్

పాలసముద్రం: తమ బ్యాంకులో ప్రభుత్వం పాఠశాలల విద్యార్థులు కొత్తగా ఖాతాలు ప్రారంభివచ్చని సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ జాకీర్ హుసేన్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థుల నుంచి బ్యాంకు ఖాతాలు ప్రారంభించేందుకు అప్లికేషన్లు స్వీకరించి ఆయన మాట్లాడారు. బ్యాంకు ఖాతా కలిగి ఉంటే ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందవచ్చని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మీనాక్షి, టీచర్ ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కావమ్మా!.. కరుణించవమ్మా



కావమ్మ ఆలయ పూజల్లో మంత్రి రోజా

పుత్తూరు: రాష్ట్ర ప్రజలందరిపై కరుణ చూపించు తల్లీ అంటూ కావమ్మవారిని ప్రార్థించినట్లు పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా తెలిపారు. పట్టణంలోని శ్రీకావమ్మ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం రాత్రి మంత్రి రోజా పాల్గొన్నారు. కావమ్మ, మారయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు సీఎం జగనన్నకు తగిన శక్తి సామర్థ్యాలు ప్రసాదించాలని కోరినట్లు చెప్పారు. అంతకు ముందు మంత్రికి ఆలయం తరపున పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు మధు, మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, కౌన్సిలర్లు రాధ, జయలక్ష్మీ, షకీలా, బాలాజీ, చిట్టిబాబు, ఆలయ కమిటీ చైర్మన్లు మనోహర్‌రెడ్డి, రమేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు జయరామిరెడ్డి, చక్రి, ప్రసాద్, ఏకాంబరం, సలీం పాల్గొన్నారు.

కామధేనువుపై కార్తికేయుని విహారం



కామధేనువుపై ఉభయ దేవేరులతో స్వామివారు

పుత్తూరు: పట్టణంలోని ప్రసిద్ధ శ్రీవల్లి దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారు కామధేనువుపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం గణపతి పూజ చేశారు. అనంతరం స్వామి అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించి, పట్టు పీతాంబరాలు, విశేష సర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం శ్రీస్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి పూజలు చేసి, కామధేనువుపై కొలువుదీర్చారు. తదుపరి మంగళవాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల సందడి నడుమ పట్టణంలో ఊరేగింపు నేత్రపర్వంగా జరిగింది. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులిచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త సుందరం పర్యవేక్షించారు.

అభివృద్ధి పథంలో పిళ్లారిపట్టు



గణపతి నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణం



పిళ్లారిపట్టులో క్యూరింగ్ దశలో సీసీ రోడ్డు

- గడప గడపకు మన ప్రభుత్వం నిధులు
- రూ.40 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణాలు
- జనరల్ ఫండ్స్ రూ.13 లక్షలతో డ్రైనేజీ నిర్మాణాలు

పుత్తూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోంది. ఇటీవల పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా పుత్తూరు మున్సిపాలిటీ 5వ వార్డు పిళ్లారిపట్టు సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయ పరిధిలోని పలు గ్రామాల ప్రజలు తమకు సీసీ రోడ్లు కావాలంటూ మంత్రికి విన్నవించారు. దీనిపై స్పందించిన మంత్రి రూ.40 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీంతో వార్డు పరిధిలోని పలు గ్రామాల్లో జోరుగా సీసీ రోడ్డు నిర్మాణాలు జరుగుతున్నాయి. గణపతినగర్‌లో రూ.14 లక్షలు, తాయిమాంబాపురంలో రూ.10 లక్షలు, ఆంజనేయపురంలో 6.75 లక్షలు, గంగమాంబాపురంలో రూ.5 లక్షలు, పిళ్లారిపట్టులో రూ.4.25 లక్షలతో లక్షలతో డ్రైనేజీ నిర్మాణ పనులు జోరుగా జరుగుతున్నాయి. అలాగే మున్సిపల్ జనరల్ ఫండ్స్ రూ.10 లక్షలతో చౌటూరులో డ్రైనేజీ, బండారుపల్లెలో రూ.3 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. అభివృద్ధి పనులను వార్డు కౌన్సిలర్ బి.రాధ, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు జయరామిరెడ్డి, మునిరత్నం ఆచ్చారి, శ్రీనివాసులు, రమణ, అయ్యప్ప, రవి పర్యవేక్షిస్తున్నారు.



ఆంజనేయపురంలో పూర్తయిన సీసీ రోడ్డు

ఓం శక్తి ఆలయంలో పూజలు



పూజల్లో పాల్గొన్న మహిళలు

పాలసముద్రం: మండలంలో నిశ్శింకాపురంలోని ఓం శక్తి ఆలయంలో అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారిని పాలు, పెరుగు, చందనం, తేనె, నెయ్యితో వివిధ అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం ప్రతి ఇంటి నుంచి ఓం శక్తి భక్తులు పంబ వాయిద్యాలతో పొంగళ్లు తీసుకొచ్చి, అమ్మవారి దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యం సమర్పించారు. అమ్మవారిని వివిధ సుగంధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. భక్తులకు పంచామృతం, తీర్థప్రసాదాల వితరణ చేశారు.

శరవేగంగా కల్వర్టు పనులు



పనులను పరిశీలిస్తున్న అధికారులు

నగరి: మున్సిపల్ పరిధి భీమానగర్‌లో కల్వర్టు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. మున్సిపల్ పరిధి 12, 13, 23, 24 వార్డుల్లో రూ.1.20 కోట్ల నిధులతో జరిగే అభివృద్ధి పనుల్లో భాగంగా కల్వర్టు నిర్మాణ పనులు సాగుతున్నాయి. స్థల వివాదాల కారణంగా రెండు దశాబ్దాల పాటు కాలువలు, కల్వర్టులు, రోడ్లు లేక అవస్థపడిన స్థానిక ప్రజలు మంత్రి ఆర్కేరోజా చొరవతో సమస్యలన్నీ పరిష్కారమై, నేడు పనులు చకచకా జరుగుతుండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎల్లప్పరెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న కల్వర్టు నిర్మాణ పనులను డీఈ నరేష్, ఏఈ నవీన్, కౌన్సిలర్లు భూపాలన్, చిత్ర పరిశీలించారు.